క్లుప్తంగా

పంట నమోదు పక్కాగా ఉండాలి



పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఉమ

యాదమరి: పంట నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది జాగ్రత్తగా నమోదు చేయాలని చిత్తూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు ఉమ సూచించారు. గురు వారం ఆమె మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. 184 గొల్లపల్లెలో రబీ సీజన్ పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతు రైతులు సీజనల్‌గా ఏఏ పంటలు సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయో వివరించాలన్నారు. ఏఓ చరిత పాల్గొన్నారు.

ఆపస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను గురువారం తన కార్యాలయంలో డీఈవో విజయేంద్రరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆపస్ సంఘ నేతలు మంజునాథగుప్త, దొరస్వామి, సాంబిరెడ్డి, మేకల సుబ్రహ్మణ్యం, ధనంజయులు, ఉమాపతి, పట్టాభి, శ్రీధర్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంసీకి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భానుమతి

పూతలపట్టు: మండలం తేనేపల్లెకు చెందిన నాగరాజుకు సీఎంసీ ఆస్పత్రికి వెళ్లి గురువారం వలంటీర్ పింఛన్ అందజేశారు. అనారోగ్యంతో నాగరాజు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకుని వలంటీర్ భానుమతి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి వేలూరు సీఎంసీకి వెళ్లి పింఛన్ అందజేశారు.

ఉపాధి పథకం కూలీలకు వరం



గట్రాళ్లమిట్టలో భూమిపూజ చేస్తున్న పీడీ గంగాభవాని

గుడిపాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఒక వరం లాంటిదని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. గురువారం గట్రాళ్లమిట్టలో అమృత్ సరోవర్ పనులకు భూమిపూజ చేసి ఆమె మాట్లాడారు. పనికి తగిన వేతనం ఉపాధి కూలీల ఖాతాలకు సకాలంలో జమ చేస్తామన్నారు. అనంతరం వసంతాపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో విధులకు వస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో జేఈ మధు, టీఏ పరదేశి, ఫీల్డ్ అసిస్టెంట్ పూర్ణిమ పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



నదుం: స్థానిక సీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ ప్రకాశం గురువారం తనిఖీ చేశారు. మండలంలో 27 టైఫాయిడ్ కేసులు రావడంతో వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అనంతరం నడిగడ్డలో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యాధికారులు శ్రీధర్, చరణ్, ఎపిడమాలజిస్ట్ ఆఫీసరు శ్రీవాణి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

'సంక్షేమం'పై పొరుగు రాష్ట్రాల చూపు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- పెరుమాళ్లకండ్రిగలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెరుమాళ్లకండ్రిగలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలను చూసి పొరుగు రాష్ట్రాలు కూడా ఆ రాష్ట్రాల్లో అమలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత గ్రామదేవత ఆలయంలో పూజలు చేసి ప్రతి ఇంటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని తెలియజేశారు. అలాగే గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి స్థలాలు, దారి సమస్యలు, విద్యుత్ తదితర సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సచివాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పక్క రాష్ట్రాలను ఆకట్టుకుంటాయన్నారు. అలాగే వలంటీర్, సచివాలయ వ్యవస్థలకు మంచిపేరు తెచ్చిందన్నారు. సచివాలయ సిబ్బంది, అధికారులు సమస్యల పరిష్కారంలో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు తిలకమ్మ, అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, సాము, ప్రసాద్, విజేంద్ర, బాబు, కన్నన్, దిలీప్, కేశవులు, ధర్మారెడ్డి, నాగేంద్ర, ప్రభాకర్, రాజేంద్ర, రంజన్, తులసిరామ్, బాలాజి, గుర్రప్ప, తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఏంఈఓ సెల్వ రాజ్, మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెర్లోపల్లె పంచాయతీలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చెర్లోపల్లె పంచాయతీలో శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం



పింఛన్ కానుక మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని తేనేపల్లి పంచాయతీ టి.రంగంపేట సచివాలయ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వా, తాతా, దివ్యాంగులు, వితంతువులు, మహిళల కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని తెలిపారు. పూతలపట్టు మండలంలో ఈనెల నుంచి 8,236 లబ్ధిదారులకు రూ.2కోట్ల,19లక్షల,61వేలను ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.వెయ్యికి మించి పింఛన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. పాదయాత్రలో చెప్పినట్టుగా జగనన్న లబ్ధిదారులకు రూ.250 పెంచుతున్నారని తెలిపారు. ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు తలుపు తట్టి లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకుడు తలపులపల్లి బాబురెడ్డి, సీనియర్ నేత రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఎంపీపీ కుమారి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ హరిప్రసాద్, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు జయచంద్రరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, నాయకులు దొరస్వామిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, నందయ్య, నాగరాజు, పోలవరం సుధాకర్ రెడ్డి, షణ్ముగం, సిద్దారెడ్డి, యతీష్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

ఐరాల: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పథకాల లబ్ధితో పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వేదగిరివారిపల్లె సచివాలయ పరిధిలోని చుక్కవారిపల్లె, చుక్కవారిపల్లె ఎస్టీ కాలనీ, ఎగువ గూబలవారిపల్లె, అరుంధతివాడ, దిగువగూబలవారి పల్లెలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. 301 కుటుంబాలను ఆయన పలకరించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇస్తున్న పింఛన్‌కు అదనంగా రూ.250 పెంచి రూ.2750 అందిస్తుండటంతో అవ్వా, తాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయా గ్రామస్తులు విన్నవించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. పార్టీలతో సంబంధం లేకుండా స్థానిక టీడీపీ సర్పంచ్ రాజేంద్రకు పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు గాను రూ.5 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ రాజేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మెంబర్ రామచంద్ర, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, టెరిన్ రెడ్డి, ధనచంద్రరెడ్డి, రాజేష్‌రెడ్డి, చంద్రరెడ్డి, కొణతం చంద్రశేఖర్, జనార్దన్, రాము, ప్రసాద్, ఎంపీడీఓ నిర్మలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో గణిత బోధనకు ల్యాబ్



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న టీచర్లు

గుడిపాల: విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందజేస్తున్నట్లు నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సబర్మతి అన్నారు. 6 నుంచి 9 తరగతి వరకు విద్యార్థులకు ట్యాబ్‌లతో గణిత బోధన చేయడానికి ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. ఈ ఏడాది గణిత సబ్జెక్టులు మాత్రమే ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన చేస్తున్నామని, ప్రతి ఏటా ఒక్కో సబ్జెక్టుపై ట్యాబ్‌లతో విద్యాబోధనందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్సనల్ అడాప్టివ్ లెర్నింగ్ ఫీల్డ్ మేనేజ్‌మెంట్ స్టాఫ్ మధు, నోడల్ ఆఫీసర్ జ్యోతిర్మయి, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీధర్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యం అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్లస్టర్ ఏపీడీ

చిత్తూరు రూరల్: గ్రామంలో ఉపాధి పనులపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం ఆదేశించారు. చిత్తూరు మండలం తాళంబేడు సచివాలయంలో ఉపాధి హామీ పనులపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఏపీడీతోపాటు సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే చేయవలసిన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించి, వాటిని నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆ తర్వాత కొత్త పనులను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్న రెడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

యాదమరి: జ్వరాలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మోర్థానపల్లెలో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. పరిసరాల శుభ్రతపై వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరాలు వస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి దోమకాటుతో ప్రాణాంతకమైన జ్వరాలు వ్యాపిస్తాయని తెలిపారు. పరిశుభ్రతపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఏఎంఓ రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజ నేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు అభిషేక పూజలు, ప్రత్యేక అలంకరణలు ఉంటాయన్నారు. 11 గంటలకు సుదర్శన హోమం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వెలుగు ఆశ్రమానికి ఆర్టీసీ ఉద్యోగుల వితరణ



దుస్తులు, పుస్తకసామగ్రి అందజేస్తున్న డీపీటీఓ

చిత్తూరు రూరల్: మదనపల్లెలోని వెలుగు ఆశ్రమానికి గురువారం డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి దుస్తులు, నిత్యావసర సరుకులు, పుస్తక సామగ్రిని అందజేశారు. రెండు రోజులకు క్రితం ఆర్టీసీ ప్రజా రవాణా కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వీటిని ఆయనకు వితరణ చేశారు. వాటిని ఆ ఆశ్రమానికి చేరవేశారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పింఛన్లు





వసంతాపురం సచివాలయంలో.., పింఛన్లు పంపిణీ చేస్తున్న చిత్తూరు మేయర్ అముద



నంగమంగళంలో..

గుడిపాల: అర్హులైన పేదలందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నంగమంగళం, వసంతాపురం సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచులు జయకోడి, రజనీకాంత్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో 6500 పింఛన్లు వస్తుండగా ఇప్పుడు కొత్తగా 186 మందికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి, కిరణ్, మాజీ ఎంపీటీసీ కళై అరసి, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు

చిత్తూరు అర్బన్: అర్హులందరికీ వైఎస్సార్ భరోసా పింఛన్లు అందేలా చూడాలని నగర మేయర్ ఎస్.అముద వార్డు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మేయర్ 39వ వార్డులో పర్యటించారు. వివిధ కారణాలతో పింఛన్లు నిలిచిపోయిన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పైవిధంగా ఆదేశించారు. అన్ని అర్హతలున్నప్పటికీ పింఛను మంజూరు మంజూరు చేయలేదని ఏ ఒక్కరూ ప్రశ్నించడానికి వీలు లేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను చూడాలన్నారు. కార్యక్రమంలో 39వ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత

- దోమల బెడద లేకుండా చేద్దాం
- సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలో నగర కమిషనర్ అరుణ



33వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత ఇచ్చి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులతో కలిసి 33వ వార్డు పరిధిలో పర్యటించారు. స్థానికంగా డెంగీ కేసు నమోదు కావడంతో ఆ గృహంతో పాటు, పరిసర గృహాలు, ప్రాంతాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి దోమ లార్వాల నిర్మూలనకు చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా రిఫ్రిజిరేటర్లు, పూల కుండీలు, వాటర్ సంపులు, చేపల పెంచే తొట్లలో దోమల లార్వాలు లేకుండా చూడాలన్నారు. వార్డు కార్యదర్శులు.. ఆశావర్కర్లు, వలంటీర్లతో ప్రతి ఇంటినీ పరిశీలించి లార్వాలు లేకుండా చూడాలని, తద్వారా దోమల బెడదకు తావివ్వరాదన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద ఫాగింగ్

చిత్తూరు అర్బన్: నగరంలో వారం పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రధానంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, జిల్లా మలేరియా విభాగం అధికారులతో కమిషనర్ తన కార్యాలయంలో సమీక్షించారు. నగరంలో డెంగీ, టైఫాయిడ్ కేసులు నమోదు కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ప్రతి ఇంటి వద్ద ఫాగింగ్, మురుగు కాలువల్లో పిచికారీ చేయాలన్నారు.వార్డు పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని, అవసరమైతే నోటీసులు జారీ చేయాలన్నారు. పారిశుద్ధ్య, బ్లాగింగ్, అవగాహన కార్యక్రమాలు, హోటళ్ల తనిఖీలకు సంబంధించి రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నగరంలో రెండు డెంగీ కేసులు

చిత్తూరు గంగనపల్లెలో ఏడాది చిన్నారికి డెంగీ నిర్ధారణ అయింది. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని వేలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా...అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ బారినపడినట్లు నిర్ధారించారు. అలాగే కట్టమంచిలో కూడా మరో కేసు నమోదైందని అధికారులు వెల్లడించారు.

ఆధార్‌తో బోగస్ ఓట్లకు చెక్



తిమ్మోజుపల్లె పోలింగ్ స్టేషన్ వద్ద ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తున్న బీఎల్‌ఓలు

మండలం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	ఆధార్‌లింకైనవి	నమోదుశాతం
ఐరాల	41	40,190	33,970	84.52
పూతలపట్టు	42	36,467	32,452	88.99
తవణంపల్లె	45	42,487	35,333	83.16
బంగారుపాళెం	66	59,454	47,333	79.61
యాదమరి	48	40,143	34,218	85.24

- పూతలపట్టు నియోజకవర్గంలో ఓటర్లు 2,18,741
- ఇప్పటి వరకు అనుసంధానమైనవి 1,83,306

బంగారుపాళెం: బోగస్ ఓట్లకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం అధునాతన సాంకేతిక సాఫ్ట్‌వేర్(ఫొటో సిమిలర్ ఎంట్రీ)ను ప్రవేశపెట్టింది. ఒకరికి ఒకటికి మించి ఓట్లు ఉండడం, మరికొందరికి వారి ఫోటోలు కాకుండా మరొకరి ఫొటో ఉండడం, మృతుల పేర్లను తొలగించకపోవడం తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తోంది. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల్లో 242 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,18,741 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 1,83,306 మంది ఓటర్లు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారు. ఇంకా 35,435 పెండింగ్‌లో ఉన్నాయి. నియోజకవర్గంలో పరిధిలో ఆధార్ అనుసంధాన ప్రక్రియ జోరుగా సాగుతోంది.

ఫారం–6బీతో అనుసంధానం..

ఓటు హక్కు ఉన్నవారంతా ఫారం 6బీ ద్వారా ఆధార్‌ను స్వచ్ఛందంగా ఓటరు కార్డుకు అనుసంధానించుకోవాలని ప్రభుత్వం నిబంధన విధించింది. నమోదు బాధ్యతను రెవెన్యూ అధికారులకు అప్పగించింది. ఆయా పోలింగ్ స్టేషన్ల ద్వారా బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

ఓటర్లు సహకరించాలి

ఆధార్‌ను అనుసంధానానికి ఓటరు కార్డులున్నవారు సహకరించాలి. మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రల్లో బీఎల్‌ఓలు ఓటరు కార్డుకు అధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు నమోదు వివరాలను ఉన్నతాధికారులకు పంపుతున్నాం. గడువులోపు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బెన్నురాజ్, తహశీల్దార్, బంగారుపాళెం